# డిజిటల్ తరగతులు.. భవిష్యత్తుకు బాటలు

- మండలంలో 18 హైస్కూళ్లకు 123 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్
- హైస్కూళ్లలో ఐఎఫ్‌పీలు, ప్రాథమిక స్కూళ్లలో స్మార్ట్ టీవీలు
- 989 మంది పిల్లలకు ట్యాబ్‌లు పంపిణీ
- డిజిటల్ క్లాస్ రూంలతో పిల్లల్లో పెరిగిన ఆసక్తి
- విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు
- పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట

ప్రభుత్వ బడులు డిజిటల్ పాఠశాలలుగా మారిపోయాయి. ఒకప్పుడు ప్రభుత్వ స్కూళ్లంటే పాతబడిన పలక, ఓ చిన్న బలపం, తరగతి గదిలో అక్షరం రాసినా పడని బోర్డులు, సకాలంలో అందని పాఠ్య పుస్తకాలు, పాతబడిన భవనాలతో కనిపించేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. నాడు–నేడుతో నూతన భవనాలు, అత్యాధునిక వసతులు కల్పించింది. పేదల పిల్లలు కూడా సాంకేతిక పరిజ్ఞానంతో విద్యనభ్యసించాలనే ఉద్దేశంతో ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ తరగతులకు శ్రీకారం చుట్టింది.

కర్నూలు (సిటీ): కార్పొరేట్ స్కూళ్లకు కూడా అందని విధంగా డిజిటల్ తరగతులుగా ప్రభుత్వ బడులు మారాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పేద పిల్లల చదువులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అమ్మ ఒడితో ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చివేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా డిజిటల్ చదువులకు శ్రీకారం చుట్టారు. ఆధునిక బోధన విధానాలను అనుసరిస్తూ విద్యార్థులకు అత్యుత్తమ రీతిలో బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రతి తరగతి గదిలో డిజిటల్ విద్యాబోధనకు చర్యలు తీసుకున్నారు. ప్రాథమిక తరగతి విద్యార్థులకు స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. పాఠాలు విద్యార్థికి మరింత చేరువగా, అర్థమయ్యేలా డిజిటల్ కంటెంట్‌లు అందుబాటులోకి వచ్చాయి. మంచి విద్య అనేది మెరుగైన భవిష్యత్తుకు పునాది. డిజిటల్ విద్యతో గతంలో కంటే పిల్లలు ఎంతో ఆసక్తితో పాఠ్యాంశాలను అభ్యసిస్తున్నారు.

| కర్నూలు రూరల్ మండలంలో పాఠశాలల వివరాలు | |
|---|---|
| ప్రాథమిక పాఠశాలలు | 58 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు | 05 |
| ఉన్నత పాఠశాలలు | 18 |
| ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ | 123 |
| స్మార్ట్ టీవీలు | 86 |
| 8వ తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు | 989 |

**స్మార్ట్ స్టడీస్**

కర్నూలు రూరల్ మండల పరిధిలో 58 ప్రాథమిక పాఠశాలలు, 05 ప్రాథమికోన్నత, 18 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కూళ్లలో మన బడి నాడు–నేడు మొదటి, రెండో విడతల్లో దాదాపు అన్ని స్కూళ్లలో పనులు చేపట్టారు. ఈ స్కూళ్లలో 123 ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, 86 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. అదే విధంగా 8వ తరగతి చదువుతున్న పిల్లలకు 989 మందికి ట్యాబ్‌లు అందజేశారు. ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలు కంప్యూటర్ కంటే వేగంగా పనిచేస్తాయి. క్లాసులో పాఠాలు చెప్పేందుకు బ్లాక్ బోర్డు, గ్రీన్ బోర్డు అవసరం లేదు. డిజిటల్ స్క్రీన్ మీద అక్షరాలు రాస్తుంటే ఏ రంగులో కావాలంటే ఆ రంగులో అక్షరాలు వస్తుంటాయి. బోర్డుపై చెప్పిన పాఠమంతా చెరిపేస్తే చెరిగిపోతుంది. సేవ్ చేస్తే స్లైడ్‌గా ఉండిపోవడమే కాకుండా రేపటి పాఠం చెప్పే ముందు మళ్లీ గుర్తు చేసేందుకు ఈ స్లైడ్‌లను వాడుకోవచ్చు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పాఠాన్ని పీడీఎఫ్ రూపంలో స్క్రీన్ మీద చూపిస్తూ పిల్లలకు వివరించవచ్చు. పాఠాలను మరింత బాగా అర్థం చేసుకునేందుకు ఇంటర్నెట్‌లోని రంగుల ఫొటోలు, గ్రాఫ్‌లు, వీడియోలను పిల్లలకు చూపిస్తూ పాఠ్యాంశాలను బోధించడం వల్ల పిల్లల్లో ఆసక్తి పెరిగి వారిలో ఆలోచన శక్తి పెరుగుతుంది.


ఉల్చాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీల ద్వారా బోధన చేస్తున్న టీచర్

### పాఠ్యాంశాలు సులువుగా అర్థం అవుతున్నాయి



మా పాఠ్య పుస్తకాల్లోని పాఠ్యాంశాలను ఆడియో విజువల్ ద్వారా చూస్తూ వినడం వల్ల చదువుపై ఆసక్తి పెరగడమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరుగుతోంది. ఫిజికల్‌గా చూడలేని దృశ్యాలను చూపిస్తూ పాఠ్యాంశాలను బోధిస్తున్నందున పాఠం సులువుగా అర్థం అవుతున్నాయి. బాగా చదువుకునేందుకు ఈ విధానం బాగుంది. – **డి.కిశోర్, 6వ తరగతి**

### కొత్తగా అనిపిస్తోంది



పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టారు. దీని వల్ల మాకు భవిష్యత్తులో ఉన్నత చదువుల్లో రాణించేందుకు అవకాశం కలుగుతుంది. ఇంత వరకు డిజిటల్ విద్య అంటే కాన్వెంట్ స్కూళ్లలో మాత్రమే ఉండేది అనుకునే వాళ్లం. కానీ ఆ స్కూళ్లకు మించి మా బడిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ డిజిటల్ విద్యను అందిస్తున్నారు. దీని ద్వారా సులువుగా నేర్చుకుంటున్నాం.
– **ప్రీతి, 6వ తరగతి విద్యార్థి**

### ప్రభుత్వ బడుల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి



రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో తీసుకొచ్చిన సంస్కరణలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. మన–బడి నాడు–నేడు ద్వారా స్కూళ్లలో గతంలో ఎప్పుడూ లేని విధంగా మౌలిక సదుపాయాలు కల్పించడంతో సరికొత్త పాఠశాలలుగా మారాయి. ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు డిజిటల్ విద్యను అమలు చేస్తున్నారు. డిజిటల్ విద్యతో పిల్లలు సైతం చాలా సంతోషంగా ఉన్నారు. కాన్వెంట్ స్కూళ్లలో కూడా లేని చదువులు ప్రభుత్వ బడుల్లో అందిస్తున్నారు. **–విద్యా సాగర్, ఉల్చాల సర్పంచ్**

## క్లుప్తంగా

### ఎన్‌ఎంఎంఎస్‌కు కొత్తకోట విద్యార్థి ఎంపిక


నందకిశోర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

సి.బెళగల్: మండల పరిధిలోని కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి నందకిషోర్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు క్రిష్ణమూర్తి, జయంతి, సోమశేఖర్‌రెడ్డి విద్యార్థులను ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు సిద్ధం చేసినట్లు చెప్పారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన నందకిశోర్‌ను బుధవారం పాఠశాలలో అభినందించారు.

### అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


కత్తి రాముడు (ఫైల్)

ఓర్వకల్లు: మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కత్తి రాముడు(80) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. 2001–06 కాలంలో సర్పంచ్‌గా సేవలందించారు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా మంచానికే పరిమితమయ్యా రు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

### ఓర్వకల్లు తహసీల్దార్ బదిలీ


శివప్రసాద్‌రెడ్డి

ఓర్వకల్లు: ఓర్వకల్లు తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి ఉమ్మడి అనంతపురంలోని సత్యసాయి జిల్లాకు బదిలీ అయినట్లు కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఏడాది కాలం ఈయన పనిచేశారు.

### జగనన్న సురక్ష శిబిరానికి స్పందన


శిబిరంలో కేస్‌షీట్లు అందజేస్తున్న అధికారులు

గూడూరు: పట్టణంలోని 3వ సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రత్యూష, వైద్య సిబ్బంది 350 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారిని కర్నూలుకు రెఫర్ చేశారు. ఉచితంగా మందులు, కేస్‌షీట్లు అందజేశారు. తహసీల్దార్ వెంకటరమణ, హెల్త్ కో ఆర్డినేటర్ కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### తాగునీటి సమస్యలపై వినతి


ఎంపీపీతో చర్చిస్తున్న గొల్లలదొడ్డి వాసులు

సి.బెళగల్: గ్రామంలోని తాగునీటి సరఫరాకు, వనరుల సంరక్షణకు సహకారం అందించాలని సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి గ్రామస్తులు ఎంపీపీ బొంతల మునెప్ప, మండల అధికారులను కోరారు. గ్రామానికి చెందిన తిరుమల్ రెడ్డి, హనుమంతు, బన్నెప్ప తదితరులు బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని తాగునీటి అవసరాలపై ఎంపీపీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సందీప్‌తో చర్చించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బోర్లకు విద్యుత్ మోటర్లు, చేతి పంపులు ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీపీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులను కలిసిన వారిలో రాఘవేంద్ర, నల్లన్న, వడ్డె నాగన్న ఉన్నారు.

### ఉలిందకొండ ఎస్‌ఐగా నరేష్ బాధ్యతల స్వీకరణ



కల్లూరు: ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ నల్లప్ప సీఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. నంద్యాల జిల్లాలో వీఆర్‌లో ఉన్న నరేష్ ఉలిందకొండ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

### కల్లూరు అర్బన్ వార్డుల సమితి సమావేశం

కల్లూరు: కల్లూరు అర్బన్ వార్డుల సమితి సమావేశం బుధవారం రామచంద్రనగర్ శాఖలో జరిగింది. సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, కె.జగన్నాథం మాట్లాడారు. టిడ్కో ఇళ్లకు కోసం డబ్బులు కట్టిన లబ్ధిదారులకు ఇంత వరకు చెల్లించకపోవడం సరికాదన్నారు. మహేష్, నాగరాజు, రాములమ్మ, విజయ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పరిశీలన


సచివాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్

కోడుమూరు రూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టాలను మహిళల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్న ప్రక్రియను మండలంలో వేగవంతం చేయాలని కోడుమూరు తహసీల్దార్ జయన్న సిబ్బందికి సూచించారు. బుధవారం కోడుమూరులోని గ్రామసచివాలయం–1ను ఆయన సందర్శించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మండలంలోని కోడుమూరు, వెంకటగిరి, వర్కూరు, ప్యాలకుర్తి, అమడగుంట్ల, ఎర్రదొడ్డి, కల్లపరి, పులకుర్తి, లద్దగిరి తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేసిందన్నారు. ఈ పట్టాలను ప్రస్తుతం ఆయా లబ్ధిదారుల పేర్ల మీద ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తోందని, లబ్ధిదారులు తమ వివరాలతో ఆయా గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

## అంటు వ్యాధుల నివారణలో వైద్యసిబ్బంది కీలకం

కర్నూలు(హాస్పిటల్): అంటు వ్యాధుల నివారణ, నియంత్రణలో వైద్య సిబ్బంది పాత్ర కీలకమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో టీబీ ముక్తభారత్ ఐపీసీ శిక్షణపై నిశ్చిత్ ప్లస్ షేర్ ఇండియా వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో అంటువ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ తదితర విషయాలపై సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బందికి టీబీ, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ బేసిక్స్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రిమిసంహారక, స్టెరిలైజేషన్, పర్యావరణ సంక్రమణ నియంత్రణ, చేతి పరిశుభ్రత, ఐసోలేషన్, మల్టీ డ్రగ్ రెసిస్టెంట్‌పై షేర్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సతీష్ కపిల్యవార్ సమీక్ష నిర్వహిస్తారన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డాక్టర్లు రేణుకాదేవి, శ్రీలక్ష్మి, సీతారామయ్య, రామ్ బాలాజీనాయక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల నాగాంజన్ పాల్గొన్నారు.

## నేడు పులకుర్తిలో వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం

కోడుమూరు: అనంతపురంలో ఈ నెల 11వ తేదీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న 'సిద్ధం' సభ కోసం గురువారం మండలంలోని పులకుర్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు తెలిపారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ గాడి రూతమ్మ హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నేతలు తప్పక హాజరు కావాలని కోరారు.

## పండ్లతోటల సాగుతో అధిక లాభాలు


పండ్లతోటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా


కోడుమూరులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు చిన్న, సన్నకారు రైతులు ముందుకు రావాలని ఏపీఓ మోదీన్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని కోడుమూరు, కొత్తూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. కూలీలు చేస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. రైతులతో సమావేశమై పండ్ల తోటల సాగుపై చర్చించారు. ఐదెకరాల్లోపు భూమి కలిగిన రైతులకు ఉపాధి హామీ పథకం కింద అన్ని రకాల పండ్ల తోటలతో పాటు, మల్లె, గులాభి వంటి పూల తోటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. ఆసక్తి గల రైతులు ముందుకొస్తే పండ్ల మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు తీసుకోవడం, మొక్కల సరఫరా, దుక్కి దున్నేందుకు, ఎరువులకయ్యే ఖర్చులను చెల్లించడంతో పాటు ఎదిగే పండ్ల మొక్కలకు నెలకు ఒక మొక్కకు రూ.25 చొప్పున మూడేళ్ల పాటు నిర్వహ ణ ఖర్చులు సైతం చెల్లిస్తుందని తెలిపారు. రైతు లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**రెండు రోజుల్లో కూలీల వేతనాలు**

ఉపాధి పథకం కింద చేసిన పనులకు సంబంధించి కూలీల వేతనాలు రెండురోజుల్లోగా కూలీల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని ఏపీఓ మోదీన్‌బాషా తెలిపారు. అలాగే గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే ఉపాధి కింద పనులు కల్పిస్తామని తెలిపారు.

## అక్రమంగా గ్రావెల్ తరలింపు

కర్నూలు (న్యూటౌన్): జిల్లాలో వివిధ చోట్ల అక్రమంగా గ్రావెల్ తరలించినట్లు తమ విచారణతో తేలిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గ్రావెల్ తవ్వకాలను మైనింగ్ అధికారులు పరిశీలించారన్నారు. గూడూరు మండలానికి చెందిన ఎ నజీర్.. సర్వే నంబర్ 663/2లో అక్రమంగా 1,121 క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌తరలించారని విచారణలో బయటపడిందన్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చెందిన ఎస్ఎన్ చాంద్‌బాషా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 119/2లో 350 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తవ్వి తరలించారని తనిఖీలో తేలిందన్నారు. మొత్తం 3,138 క్యూబిక్ మీటర్లు అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలించిన అక్రమార్కులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. కృష్ణగిరి మండలం చుంచుఎర్రగుడి గ్రామంలో సర్వే నంబర్ 560లో లీజుదారుడు గని తరఫు కేటాయించిన ప్రదేశం నుంచి 0.12 హెక్టార్లు బయటకు జరిగి ఖనిజ సంపదను తవ్వకాలు జరిపినట్లు విచారణలో తేలిందన్నారు. దీనికి సంబంధించిన యజమాని ఎస్ సూర్యచంద్రుడు నుంచి రూ.60వేలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

**రెండు లారీలు సీజ్**

డోన్ నుంచి హైదరాబాద్, బెంగళూరుకు అక్రమంగా డొలమైట్ తరలిస్తున్న రెండు లారీలను డోన్ సమీపంలో సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. అలాగే కల్లూరు మండలం ఉలిందకొండ దగ్గర అక్రమంగా మెటల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేశామన్నారు. మొత్తం రూ.1.20లక్షల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.


కృష్ణగిరి మండలం చుంచు ఎర్రగుడిలో అక్రమంగా గ్రావెల్ తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా మైనింగ్ అధికారులు

## పేదల ఇళ్ల స్థలాలకు పక్కా రిజిస్ట్రేషన్లు

- జగనన్న కాలనీల్లో పేదల స్థలాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- గడివేముల మండలంలో 1778 మందికి లబ్ధి
- గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధిదారుల హర్షం

| గ్రామం | పంపిణీ చేసిన పట్టాలు |
|---|---|
| మంచాలకట్ట | 85 |
| గని | 215 |
| పెసరవాయి | 181 |
| బూజునూరు | 211 |
| కరిమద్దెల | 116 |
| గడివేముల | 383 |
| బిలకలగూడూరు | 257 |
| కొర్రపోలూరు 72 | |
| ఒండుట్ల | 16 |
| ఎల్‌కే తాండ | 34 |
| చిందుకూరు | 210 |


గడివేములలోని జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

గడివేముల: రాష్ట్రంలో పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'నవరత్నాలు అందరికీ ఇళ్లు' పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఊరు, వార్డుల్లో లేఅవుట్లు వేశారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. అంతటితో ఆగకుండా ఆ స్థలాలపై పేదలకు పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సోమవారం నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్ణయంతో ఇంటి స్థలం వచ్చిన పేదలకు మేలు జరగనుంది. ఇంటిపై సర్వహక్కులు లభించనున్నాయి.

**మండలంలో 1778 మంది..**

ప్రభుత్వం గడివేముల మండలంలో 1778 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేసింది. అర్హులైన వారందరికీ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. వాటిలో ఇళ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల చొప్పున సాయం అందించింది. డ్వాక్రా మహిళలకు మరో రూ.35 వేల రుణం మంజూరు చేసింది. రాయితీపై సిమెంట్, ఐరన్‌తో పాటు ఇసుక ఉచితంగా అందిస్తోంది. జగనన్న కాలనీల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ ఇతర వసతులు కల్పిస్తోంది. అన్ని కాలనీల్లో నిర్మించిన ఇంటి విలువ రూ.10లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉంటుంది.

**ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్లు**

జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఫిబ్రవరి 9లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఇప్పటికే వీఆర్‌ఓలు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం తరఫున వీఆర్‌ఓ లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయనుండగా, కార్యదర్శులు జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లబ్ధిదారుని ప్లాట్ నంబర్, సరిహద్దుల వివరాలను రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు.

**టీడీపీ హయాంలో డీ పట్టాలు మాత్రమే**

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల లబ్ధిదారులకు డీపట్టాలు మాత్రమే ఇచ్చేవి. గృహ నిర్మాణ రుణం కోసం ఆ పట్టాలను హౌసింగ్ కార్పొరేషన్ తనఖా పెట్టుకునేది. లబ్ధిదారులకు ఎలాంటి హక్కులూ ఉండేవి కావు. అప్పులు పుట్టక ఇబ్బందికర పరిస్థితులు ఉండేవి.

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్వ హక్కులు**

పేదల ఇళ్లపై సీఎం జగన్ సర్వహక్కులు కల్పిస్తున్నారు. పదేళ్ల తర్వాత ఇంటిపై అన్ని హక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి కన్వెన్షన్ డీడ్ అందజేస్తున్నారు. దీని కోసం భూముల చట్టాన్ని ప్రభుత్వం సవరించింది. పదేళ్ల తర్వాత ఇవి సేల్ డీడ్‌లుగా మారతాయి. తద్వారా లబ్ధిదారులకు ఆ ఇంటిపై సర్వహక్కులు సంక్రమిస్తాయి. అలాగే, నివసిస్తున్న ఇంటి సమీపంలోని సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.



బిలకలగూడూరు సచివాలయం

### గడువులోగా పూర్తిచేస్తాం



జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ చేయడానికి ఏర్పాట్లు చేశాం. ఫిబ్రవరి 9లోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. ఈ ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఇళ్లపై లబ్ధిదారుడికి పూర్తి హక్కులు లభించడంతో పాటు వారికి ఎంతో మేలు జరుగుతుంది.
**–శ్రీనివాసులు, తహసీల్దార్, గడివేముల**

## ప్రాధాన్యత పనులను చేపట్టండి


సర్పంచ్‌లు, పీఎస్‌లతో సమీక్షిస్తున్న అధికారులు

సి.బెళగల్: గ్రామాల్లో ప్రజల అవసరాలు, సమస్యల పరిష్కారంలో పనుల ప్రాధాన్యతను గుర్తించి ఆ మేరకు పనులను చేపట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సందీప్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులుతో కలిసి మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో 15 ఫైనాన్స్ నిధుల వినియోగంపై సమీక్షించారు. ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను ఖర్చు చేయడానికి తక్షణ అవసరాలను గుర్తించాలని, అదే విధంగా పనుల పద్దుల ఆధారంగా నిధులను కేటాయించి క్రమ పద్ధతిలో ఖర్చు చేయాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. సమావేశంలో సి.బెళగల్, సంగాల, బ్రాహ్మణదొడ్డి, ఇనగండ్ల, కొత్తకోట సర్పంచ్‌లు పాండురంగన్న, హనుమంతు, దస్తగిరి, శ్రీనివాసులు, పీఎస్‌లు పాల్గొన్నారు.

### 6న బహిరంగ వేలం పాట

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీదుర్గాభోగేశ్వ క్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు సంబంధించి ఫిబ్రవరి 6వ తేదీ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా తాత్కాలికంగా కొబ్బరి కాయలు, బెంగర పండ్లు, చెరుకుగడలు, ఐస్, కూల్‌డ్రింక్స్, సప్లయర్ బాడుగకు విక్రయించుకునేందుకు ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

### నేడు ఉద్యోగ మేళా

కర్నూలు సిటీ: నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గురువారం సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. వివిధ కంపెనీలు హాజరవుతున్న ఈ మేళాకు పదవ తరగతి ఆపై విద్యార్హత గల వారు అర్హులు. పూర్తి వివరాలకు సెల్: 8374231357, 8309283980, 6300009183 నంబర్లను సంప్రదించాని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు తెలిపారు.